క్లుప్తంగా

1422.2 మి.మీ. వర్షపాతం నమోదు

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గడిచిన 24 గంటల్లో మంగళవారం ఉదయానికి 1422.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు ప్రకటించారు. అత్యధికంగా సంగం మండలంలో 220.6 మి.మీ., ఆత్మకూరు 193.2, అనంతసాగరం 195.8, కలువాయి 192.8, మర్రిపాడు 147.6, ఉదయగిరి 128.4, సీతారామపురం 72, చేజర్ల 139.4, ఏఎస్‌పేట, 132.4 మి.మీ. వంతున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

విద్యుత్‌కు అంతరాయం

కలిగిరి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెలగపాడు వద్ద ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును మేకపాటి రాజారెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. కలిగిరి పంచాయతీ వెంకన్నపాళెం ఎస్టీ కాలనీవాసులకు భోజన వసతి కల్పించారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి


ప్రాజెక్ట్ మేనేజరుతో మాట్లాడుతున్న రాజారెడ్డి

దుత్తలూరు: హైవే ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిల వద్ద రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మేకపాటి రాజారెడ్డి తెలిపారు. భారీ వర్షాల కారణంగా బ్రహ్మేశ్వరం పాత చెరువు నిండి అలుగు పారడంతో బ్రహ్మేశ్వరం సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజారెడ్డి వెంటనే హైవే ప్రాజెక్ట్ మేనేజరుతో మాట్లాడి రాకపోకలు సాగించేలా వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేయించారు. దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రిలోని వసతులు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, తదితరులున్నారు.

ఊపిరి పోసిన వర్షాలు


బొగ్గేరు ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

ఆత్మకూరురూరల్: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు నియోజకవర్గంలోని 33 వేల ఎకరాల ఆయకట్టు భూములకు ఊపిరిపోసిందని ఆత్మకూరు జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటేశ్వర్లు తెలిపారు. బొగ్గేరు నుంచి మండలంలోని గొల్లపల్లి వద్ద ఆత్మకూరు చెరువుకు సాగునీరు తరలించే ఏటీఎస్ చానల్ వద్ద ప్రవాహ ఉధృతిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు మండలాలకు సంబంధించి 159 ఇరిగేషన్ చెరువులు భారీ వర్షాలు కారణంగా 50 శాతానికిపైగా నిండాయన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

తీరం అతలాకుతలం

ముందుకు చొచ్చుకువచ్చిన సముద్రం, కోతకు గురైన తీరం

- 40కి పైగా విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన చెట్లు
- 450 ఎకరాలకు పైగా దెబ్బతిన్న వరి, వేరుశనగ పంటలు


బిట్రగుంట: తాటిచెట్లపాళెం వద్ద అలల ఉధృతి

బిట్రగుంట: 'మిచాంగ్' తుఫాన్ బోగోలు తీరాన్ని అతలాకుతలం చేసింది. తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు తీర ప్రాంత గ్రామాలు చిగురుటాకులా వణికాయి. తాటిచెట్లపాళెం వద్ద కడలి కల్లోలంగా మారింది. సముద్రం ముందుకు చొచ్చుకు రావడంతో ఒడ్డు భారీగా కోతకు గురైంది. అలల ఉధృతికి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వరకు సముద్రపు నీరు చొచ్చుకు వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తుఫాన్ తీరం దాటిన తర్వాత మాత్రమే సముద్రం శాంతించింది. మండలంలో 40కి పైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడం, చెట్ల కొమ్మలు విరిగిపడి తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం వరకు సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో పలుచోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు, చెట్ల కొమ్మలు తొలగించేందుకు ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. మరో వైపు వర్షాల కారణంగా సుమారు 100 ఎకరాల్లో నారు మడులు, 250 ఎకరాల్లో ఇటీవలే వేసిన నార్లు, 100 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

చెరువులకు జలకళ

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా వెలవెలబోతున్న చెరువులు ప్రస్తుతం జలకళతో కళకళలాడుతున్నాయి. బోగోలు, కడనూతల తదితర చెరువులు అలుగుల మట్టానికి చేరాయి.


సంగం: జలకళను సంతరించుకున్న సంగం బ్యారేజ్


మర్రిపాడు: కూలిన పొగాకు బ్యారెన్


వరికుంటపాడు: పొంగి పొర్లుతున్న పిల్లాపేరు వాగు


జలదంకి పెద్ద చెరువును పరిశీలిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

నేల కొరిగిన భారీ వృక్షం

అల్లూరు: తుఫాను కారణంగా మంగళవారం తెల్లవారుజామున భారీ వాన, ఈదురుగాలులకు మండలంలో పలుచోట్ల వృక్షాలు నేల కొరిగాయి. పడమర గోగులపల్లి – అల్లూరు మార్గంలో భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి అల్లూరు చెరువు నిండు కుండలా మారింది. చెరువు పూర్తిగా నిండి పోవడంతో వర్షపు నీరంతా చెర్లో సంఘం పంట పొలాల మీదకు రావడంతో చెరువును తలపిస్తోంది. ఇటీవల రైతులు నార్లు పోయగా, మరి కొందరు నారేతలు వేశారు. వర్షపునీరు బయటకు వెళ్లకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గేరు పరవళ్లు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల పరిధిలో 30 గ్రామాలకుపైగా సాగునీటి వనరుగా ఉన్న బొగ్గేరు మంగళవారం పరవళ్లెత్తి ప్రవహించింది. ఈ రెండు మండలాల్లోని పది చెరువుల్లో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ప్రవాహం ఇలాగే కొనసాగితే బుధవారం ఉదయానికల్లా అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగులు పారుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కరటంపాడు, అప్పారావుపాళెం, బట్టేపాడు, వాశిలి, బోయలచిరివెళ్ల, తదితర గ్రామాల్లో సాగులో ఉన్న వరి, పత్తి, పొగాకు, తదితర పంటలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పలు చోట్ల కూలిన చెట్లు

ఆత్మకూరు: తుఫాన్ కారణంగా పట్టణంలోని పలు చోట్ల చెట్లు నేలకూలాయి. దీంతో కౌన్సిలర్లు, స్థానికులు చెట్లను తొలగించారు. 14వ వార్డు పరిధిలో చింతచెట్ల కాలనీలో ఓ భారీ చింతచెట్టు ఓ ఇంటిపై పడడంతో దెబ్బతింది. ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. 7వ వార్డు తూర్పువీధిలో ఓ చెట్టు గోడపై పడిపోవడంతో ఆ గోడ పూర్తిగా దెబ్బతింది. స్థానిక కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, పార్టీ నేత జమీర్, మున్సిపల్ సిబ్బంది కూలిన చెట్టును తొలగించారు. బీఎస్సార్ సెంటర్ దర్గా వద్ద హిల్ రోడ్డుకు అడ్డంగా గంగిరేణి చెట్టు నేలవాలింది. మున్సిపల్ సిబ్బంది, దర్గా నిర్వాహకులు, కూలిన చెట్టును తొలగించారు.

పొంగిన నల్ల వాగు

చేజర్ల: తుఫాన్ కారణంగా మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షపాతం నమోదైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలో పలు చోట్లు చెట్లు నేలకొరిగాయి. ఆదూరుపల్లి, చిత్తలూరు, గొల్లపల్లి ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా కొన్ని చెట్లు పడ్డాయి. యనమదల వద్ద ఉన్న నల్లవాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో కలువాయి నుంచి కాకివాయి, బిల్లుపాడు మీదుగా చేజర్ల మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై మరిడినాయుడు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న వాగును ఎవరూ దాటకుండా కట్టడి చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేదు. పునరుద్ధరణ చర్యల్లో విద్యుత్ సిబ్బంది తలమునకలై ఉన్నారు.

నేలకూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

సంగం: తుఫాను బీభత్సం మండలాన్ని అతలాకుతలం చేసింది. భారీ పెనుగాలులు, వర్షానికి మండలంలోని కోలగట్ల, ఉడ్‌హౌస్‌పేట గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ స్తంభాలు, నేలవాలాయి. తరుణవాయి సమీపంలో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను తహసీల్దారు నాగరాజు, ఎస్సై నాగార్జునరెడ్డి యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. సంగం కొండపై నుంచి జాతీయ రహదారిపై కొండరాళ్లు విరిగి పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో బీరాపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు సంగం దళితవాడతో పాటు మండలంలోని జెండాదిబ్బ, అన్నారెడ్డిపాళెం, దువ్వూరు, తరుణవాయి, కోలగట్ల ప్రాంతాల్లో గిరిజనులను అధికారులు ముందస్తుగానే పునరావాస కేంద్రాలకు తరలించారు. తరుణవాయి పునరావాస కేంద్రాన్ని ఆత్మకూరు ఆర్డీఓ మధులత సోమవారం అర్ధరాత్రి తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు పాలు, అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు అందజేశారు. ఎంపీడీఓ గోపి తరుణవాయి, సంగం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు సహాయక కార్యక్రమాలు చేపట్టారు. చెన్నవరప్పాడు సమీపంలోని కలుజు పొంగి పైకి భారీ చేరిన వరద నీటితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బ్యారేజ్‌కు జలకళ

తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సంగం పెన్నా బ్యారేజ్ ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరింది. వరద నీటితో సంగం పెన్నా బ్యారేజ్ కళకళలాడుతోంది. సంగం బ్యారేజ్‌ని జలవనరుల శాఖ ఏఈ కృష్ణ సందర్శించి నీటిమట్టాన్ని పరిశీలించారు. సుమారు 3200 క్యూసెక్కుల వరద నీరు సంగం బ్యారేజ్‌కు చేరినట్లు ఆయన తెలిపారు.

కూలిన బ్యారెన్

మర్రిపాడు: తుఫాను ఈదురు గాలులకు పొగాకు, మిరప పంటలు దెబ్బతిన్నాయి. మర్రిపాడులో గంగినేని వెంకట లక్ష్మమ్మకు చెందిన పొగాకు బ్యారెన్ వర్షం కూలిపోయింది. కృష్ణాపురంలో 10 హెక్టార్లలో మిరప పంట దెబ్బతినింది. 67వ నంబరు జాతీయ రహదారిపై నందవరం కూడలి ఉదయగిరికి రాకపోకలు నిలిపివేశారు. నెర్దనంపాడు వద్ద వర్షాలకు చప్టా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలు మర్రిపాడు-ఏపిలగుంట మీదుగా దారి మళ్లించారు.

ఉధృతంగా కొమ్మలేరు

సోమశిల: తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల్లోని వర్షపు నీటితో కొమ్మలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలైన అనంతసాగరం, బెడుసుపల్లి, లింగంగుంట, దేవరాయపల్లి, కచిరిదేవరాయపల్లి, కొత్తపల్లి, మినగల్లు గ్రామాల్లోని పలు గ్రామాల్లోని మాగాణి పొలాల్లోకి వరద ప్రవాహం రావడంతో వరినారుమడులు నీట మునిగాయి. పలు రహదారులు నీట మునిగాయి.

పొంగిపొర్లుతున్న పిల్లాపేరు

వరికుంటపాడు: తుఫాన్ ప్రభావంగా మండలంలో చెదురుమదురు పరిస్థితులు ఏర్పడ్డాయి. సోమవారం కురిసిన మోస్తరు వర్షానికి మండలంలోని కనియంపాడు-రామదేవులపాడు మధ్య పిల్లాపేరు వాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తోంది. ఎస్సై విజయ్‌శ్రీనివాస్ పోలీసు సిబ్బంది వాగు వద్ద గస్తీ ఏర్పాటు చేసి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వరికుంటపాడు, జి.కొత్తపల్లి మార్గమధ్యంలో రోడ్డుపై చెట్లు పడిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. వరికుంటపాడులో ఓ చెట్టు విరిగి ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. జి.కొండారెడ్డిపల్లిలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. తోటలచెరువుపల్లిలో 15 ఎకరాలు, జి.కొండారెడ్డిపల్లెలో 20 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. కనియంపాడులో 4 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది.

వలస కూలీలు సురక్షిత ప్రాంతానికి తరలింపు

మండలంలోని కాంచెర్వు అటవీ ప్రాంతంలో జామాయిల్ చెట్లను కొట్టేందుకు ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వచ్చిన 37 మంది వలస కూలీలు అటవీ ప్రాంతంలో చిక్కుకున్న విషయం తెలుసుకుని అటవీ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు వారిని సురక్షితంగా తీసుకొచ్చి సచివాలయ భవనంలో వసతి కల్పించి ఆహార పదార్థాలు అందించారు. గ్రామంలోని పాతశాల భవనం వర్షానికి కూలిపోయింది.

పునరావాస కేంద్రాల పరిశీలన

అనుమసముద్రంపేట: తుఫాన్ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న మండలంలోని దూబగుంట, శ్రీకొలను, చిరమన, హసనాపురం, కాకర్లపాడు గ్రామా ల్లో 80 గిరిజన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం తహసీల్దారు లక్ష్మీనరసింహ, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి పునరావాస కేంద్రాలను పరిశీలించారు. శ్రీకొలను సచివాలయ సిబ్బంది పత్తా లేకుండాపోవడంతో ఎంపీపీ వారిపై మండిపడ్డారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. అధికారులు వెంటనే తొలగించి రాకపోకలను పునరుదంధరించారు.

పొంగుతున్న వాగులు

జలదంకి: తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చెరువులు జలకళను సంతరించుకోగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలదంకి, బ్రాహ్మణక్రాక ఎస్సీ, ఎస్టీ కానీల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. కమ్మవారిపాళెం, చామదల వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల రోడ్లు కొట్టుకుపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బతినడం తప్ప ఎలాంటి ప్రమాదాలు జరుగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు వాటిల్లలేదు. పొలాల్లో కొన్ని చోట్ల నారుమడులు దెబ్బతినడం, నాట్లు నీట మునగడం జరిగింది.

జలదంకి పెద్ద చెరువును పరిశీలించిన మేకపాటి

జలదంకి పెద్ద చెరువును ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. చెరువుకు గండ్లు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన చినక్రాక రిజర్వాయర్‌కు చేరుతున్న నీటి మట్టాన్ని పరిశీలించారు. రైతులు రిజర్వాయర్ అలుగు నుంచి వృథాగా వెళుతున్న నీటిని జలదంకి చెరువు, ఎల్ఆర్ అగ్రహారం చెరువులను నింపాలని కోరారు. దీంతో స్పందించిన రాజగోపాల్‌రెడ్డి ఆ విధంగా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. జలదంకిలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ ఆహారంతో పాటు పాలు, మంచినీరు విధిగా ఉండేలా చూడాలని సూచించారు. మండలంలో ప్రజలకు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే తక్షణ సహాయక చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ బత్తిన సింగయ్య, నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, రామాల రమేష్‌రెడ్డి, సురె వెంకట శేషారెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

ఉధృతంగా వాగులు, వంకలు

కొండాపురం: మండలంలో పలుచోట్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో సుమారు 139.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలంలోని కొమ్మి, అగ్రహారం ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్య ఉన్న మిడత వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు ఆగిపోయాయి. గానుగపెంట-ఆదిమూర్తిపురం వద్ద ఉన్న మిడతవాగు బ్రిడ్జిపై ప్రవాహం ఉండడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాసులు వాగులను పరిశీలించి ఆయా గ్రామాల వద్ద పొంగిన వాగులు, వంకలకు తలారులను కాపలా పెట్టారు.

వాగులు ఉధృతం

సీతారామపురం: మండలంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భైరవకోనలో 101 కోనేరుల నుంచి జాలువారే జలపాతం వద్ద నీటి ప్రవాహం పెరిగింది. సిద్దేశ్వరం మార్గంలో బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రావెల్ రోడ్డు కోతకు గురైంది.

పక్కాగా పునరావాస ఏర్పాట్లు

ఆత్మకూరురూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధికారులు పునరావాస కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని కరటంపాడు, బండారుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో సుమారు 90 మందికి సంరక్షణ ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు ఆర్డీఓ కరుబా మధులత, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తహసీల్దారు జగదీష్‌బాబు బాధితులకు మూడు పూటలా ఆహారం, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. బండారుపల్లిలో పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ మధులత బాధితులకు స్వయంగా భోజనం వడ్డించారు.


సీతారామపురం: సిద్దేశ్వరం మార్గంలో బ్రిడ్జి పైన నీటి ప్రవాహం


బిట్రగుంట: వడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


అల్లూరు: నేల కూలిన భారీ వృక్షం


సంగం: వర్షానికి నేలకూలిన చెట్లు


కొండాపురం: పొంగిన మిడత వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్


సంగం: రోడ్డుపై పడిన చెట్లను తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎస్సై


జలదంకి: కమ్మవారిపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నేరెళ్ల వాగు


ఆత్మకూరురూరల్: బందారుపల్లి పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ఆర్డీఓ మధులత


ఆత్మకూరు: పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వర రెడ్డి భోజన వసతి కల్పన


ఆత్మకూరు: 7వ వార్డులో కూలిన చెట్లను తొలగిస్తున్న కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బంది


ఆత్మకూరు: బీఎస్సార్ సెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు


ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెం-చేజర్ల మార్గంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు


ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెంలో నీటమునిగిన వరి చేను


చేజర్ల: యనమదల దగ్గర ఉన్న నల్లవాగు వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసులు

తుఫాన్ ప్రభావం పాక్షికం

- గాలుల ధాటికి దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ
- ఉద్యాన, వ్యవసాయపంటలకు నష్టం

ఉదయగిరి: మిచాంగ్ తుఫాన్ ప్రభావం నియోజకవర్గంపై పాక్షికంగా ఉంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షాలు, గాలుల ధాటికి విద్యుత్ వ్యవస్థ కొంత మేర దెబ్బతినగా ఉద్యాన, వ్యవసాయ పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది. గాలుల ధాటికి రోడ్లపై కూలిన చెట్లను కూడా అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లను తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు సాగించారు. ఉదయగిరి మండలం అన్నంపల్లి వద్ద వాగుపై చప్టా కొట్టుకుపోవడంతో రాకపోకలకు కొంత ఇబ్బంది కలిగింది. పిల్లాపేరు, ఉప్పుటేరుల్లో ఉదయం పూట ఉధృతంగా ప్రవహించడంతో పోలీసులు ఆ ప్రాంతంలో కాపలా ఉండి రాకపోకలను ఆపివేశారు. జలదంకి, వింజమూరు, కలిగిరి మండలాల్లోని గిరిజన కాలనీల్లోని ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజన వసతి కల్పించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా ఆపివేయడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సరఫరా పునరుద్ధరించారు.

దెబ్బతిన్న ఉద్యాన, వ్యవసాయ పంటలు

వర్షం, గాలుల ధాటికి కలిగిరి, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో సాగులో ఉన్న అరటి, వరి, మినుము, మిరప బొప్పాయి పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది. వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి, జి.చెరువుపల్లి, కనియంపాడులో పంట దశలో ఉన్న 90 ఎకరాల వరి నేలమట్టమైంది. వింజమూరులో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. వింజమూరు పట్టణంతో పాటు వరికుంటపాడు మండలం జి.కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.


దుత్తలూరు-వింజమూరు హైవేలో దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న మేకపాటి రాజారెడ్డి

నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటాం: మేకపాటి రాజారెడ్డి

తుఫాన్ వల్ల నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ సమన్వయకర్త రాజారెడ్డి తెలిపారు. లోతట్టు గిరిజన కాలనీల వాసులకు తాత్కాలిక సాయం వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. పూరిగుడిసెల్లో ఉన్న వారికి పక్కాగృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గండిపాళెం రెసిడెన్సియల్ స్కూల్‌ను రాజారెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గండిపాళెం జలాశయాన్ని పరిశీలించి నీటి ప్రవాహంపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వరికుంటపాడు మండలం గొల్లపల్లి గిరిజన కాలనీని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీకి అవసరమైన విద్యుత్ లైను, సిమెంటు రోడ్లను సంక్రాంతి లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు అండగా ప్రభుత్వ యంత్రాంగం

- సహాయక చర్యలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

సోమశిల: తుఫాన్ ప్రభావంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలను మంగళవారం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. అనంతసాగరం ఎస్టీ కాలనీ గిరిజనులను పరామర్శించారు. గిరిజనుల కోసం వైఎస్సార్‌సీపీ నేత బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి అందజేసిన ఆహారాన్ని ఎమ్మెల్యే మేకపాటి స్వయంగా వారికి వడ్డించారు. అనంతరం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాలపై సమీక్షించి అత్యవసరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. పాతదేవరాయపల్లి పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రేవూరు బీసీ బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. వర్షాలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడారు. పాతదేవరాయపల్లిలో బండరేవు వాగుకు బ్రిడ్జి ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, పాతాళపల్లి సర్పంచ్ బిజివేముల ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.


ఆత్మకూరురూరల్: కరటంపాడు పునరావాస శిబిరంలో బాధిత గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం

ఆత్మకూరురూరల్: తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరటంపాడు గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా రూ.2500 నగదు అందిస్తామన్నారు. గిరిజన చిన్నారులకు బిస్కెట్లు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు షఫీ, ఎల్‌వీ ప్రసాద్, వీఆర్‌ఓ ప్రతాప్, మున్సిపల్ ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు, నాయకులు షఫీ, ముజ్జు, వాసిపల్లి లక్ష్మీరెడ్డి, నెట్టెం పిచ్చయ్య నాయుడు, శేషయ్య, లాలూఖాన్ పాల్గొన్నారు.